ఈవీఎం గోదాంలను పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 16: కామారెడ్డిలో రెండు ఈవీఎం గోదాంలను శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోదాం తాళాలను తీయించారు. గోదాంలో ఉన్న చెడిపోయిన ఈవీఎంలను పరిశీలించి వాటికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. ఈవీఎంలను ఈసీఎల్, బెంగళూర్, బెండ్, బీహెచ్ఎల్ కంపెనీలకు పంపుతామని ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీఓలు రఘునాథరావు, ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో ఉధృతంగా పారుతున్న వాగు



కామారెడ్డిలో ఇళ్లలోకి చేరిన నీటిని ఎత్తిపోస్తున్న ప్రజలు

దంచికొట్టిన.. వాన

- జిల్లాలో భారీ వర్షం
- కామారెడ్డిలో తాగునీటి కష్టాలకు కాస్త ఊరట
- పెరుగనున్న భూగర్భ జలాలు
- చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరద
- కామారెడ్డిలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదు

కామారెడ్డి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో వర్షం దంచికొట్టింది. ఈ సీజన్‌లో ఇదే పెద్ద వర్షం కావడం విశేషం. గత పక్షం రోజులుగా జిల్లాలో వర్షాలు లేక ఉక్కబోతలతో సతమతం అవుతున్న ప్రజలు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కాస్త ఊరట కల్పించింది. కామారెడ్డి పట్టణంలో పెద్ద వర్షాలు లేక భూగర్భ జలాలు వృద్ధి చెందక తాగునీటి సమస్య ఏర్పడుతూ వస్తోంది. కురిసిన భారీ వర్షంతో భూగర్భ జలాలు కాస్త వృద్ధి చెందే అవకాశం ఉందని తాగు నీటి ఎద్దడి నుంచి గట్టెక్క వచ్చని పట్టణవాసులు భావిస్తున్నారు. భారీ వర్షంతో కామారెడ్డి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై వరద పోటెత్తింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు సైతం ఈ వర్షం కాస్త ఊరట కల్పించింది. జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది.

కామారెడ్డి, భిక్కనూరులో భారీ వర్షం

కామారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు శివారు ప్రాంతాలు, గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో పట్టణం లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బతుకమ్మ కుంట, డ్రైవర్ కాలనీ, అయ్యప్ప నగర్, వాసవినగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్, టీచర్స్ కాలనీల్లో రోడ్లు జలమయ్యాయి. పలుచోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో ఆ నీటిని ఎత్తిపోసేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మున్సిపల్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, నిజాంసాగర్ రోడ్డు, విద్యానగర్, ఎన్‌జీవోస్ కాలనీ తదితర కాలనీల్లోని ప్రధాన రహదారుల్లో భారీగా వరద చేరడంతో కాలువలను తలపించాయి. సుమారు రెండు నుంచి మూడు గంటల పాటు వర్షం దంచికొట్టడంతో కామారెడ్డి తడిసి ముద్దయింది. కాగా భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి - మల్లుపల్లి గ్రామాల మధ్య వాగు రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని బస్వాపూర్ అటవీ ప్రాంతం నుంచి గ్రామ చెరువులోకి రైల్వేబ్రిడ్జి గుండా నీరు ఉధృతంగా రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో వర్షం, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ వైరు తెగిపడటంతో గ్రామస్థులు విద్యుత్ అధికారులకు సమాచారం అందివ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. రాజంపేటలోని రోడ్డుపై చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు, గ్రామసులు చెట్లను నరికివేసి తొలగించారు. నిన్నటి వరకు భూగర్భ జలాలు లేక బోర్లలో నీరు రాలేని పరిస్థితి. దీంతో పట్టణ ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటూ వచ్చారు. ఈ భారీ వర్షంతో భూగర్భజలాలు కాస్త వృద్ధి చెందే అవకాశం ఉందని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

వర్షకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా జిల్లాలో ముసురు అడపాదడప వర్షాలే తప్ప పెద్ద వర్షాలే లేవు. గత పక్షం రోజులుగా వర్షాలు ముఖం చాటేయడమే కాకుండా ఉక్కబోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ఉక్కబోతలతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అదేవిధంగా రైతులు సైతం వర్షాలు లేక పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ఎండలు తీవ్రంగా కొట్టడంతో పంటలకు సాగునీరు అందలేని పరిస్థితి ఎదురైంది. రెండ్రోజుల క్రితం సదాశివనగర్ మండల పరిధిలో విద్యుత్ సక్రమంగా ఇవ్వడం లేదని పంటలకు నీరు అందలేని పరిస్థితి ఎదురవుతుందని రైతులు సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. అయితే శుక్రవారం కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి, రాజంపేట తదితర మండలాల్లో భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షాలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదు

జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. గత నెల జూలైలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ నుంచి ఆగస్టు వరకు జిల్లా వ్యాప్తంగా 487.0 మి.మీల వర్షం కురిసింది. ఆగస్టులో సాధారణం కంటే తక్కువే వర్షపాతం నమోదైంది. నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, డోంగ్లి, పల్వంచ మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది. మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, భిక్కనూర్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కేవలం నస్రూల్లాబాద్ మండలంలోని సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టులు, చెరువుల్లోకి స్వల్పంగా చేరుతున్న వరద

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన ప్రాజెక్టులతో పాటు పెద్ద చెరువులోకి, కుంటల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. కళ్యాణి, సింగీతం రిజర్వాయర్‌లు ఇప్పటికే నిండుకున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్ట్ 17.802 టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 4.075 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్టులోకి సైతం స్వల్పంగా వరద వస్తోంది. పోచారం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.075 టీఎంసీలలో నీరు నిల్వ ఉండగా స్వల్పంగా వరద పోటెత్తుతోంది.





నిజాంసాగర్ రోడ్డులో భారీగా నిలిచిన నీరు, వాహనాల రాకపోకలకు అంతరాయం, నీటిలో ఇరుక్కుపోయిన వాహనం



పెద్దమల్లారెడ్డి-మల్లుపల్లి మధ్యలో పారుతున్న వాగు



రాజంపేటలో రోడ్డుపై పడిన చెట్టునుతొలగిస్తున్న దృశ్యం

జిల్లాలో ఘనంగా వరలక్ష్మీ పూజలు



కామారెడ్డిలో వరలక్ష్మీ పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 16: జిల్లాలో మహిళలు శుక్రవారం ఘనంగా వరలక్ష్మీ పూజలను నిర్వహించారు. కామారెడ్డిలోని వార్డుల్లో పలు ఆలయాల్లో మహిళలు పూజలు చేయడంతో పాటు ఒకరికొక్కరు వాయనాలు ఇచ్చుకున్నారు. అదేవిధంగా విద్యానగర్‌లోని ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరనాథ శివలింగ దర్శనం కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశీ, వనిత, పంపరి లత శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సుధాకర్, బ్రహ్మ కుమారీలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని శిశుమందిర్‌లో సామూహిక పూజలను చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుడు సత్యప్రసాద్, ప్రత్యేక పూజలు చేశాడు. సుఃఖ సంతోషాలను, అష్ట ఐశ్వర్యాలను ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు కొత్త దుర్గయ్య సేట్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, సభ్యులు శివ్వయ్య, చందు, బాలకిషన్, ప్రధానాచార్యులు సుమలత, ఉపాధ్యాయలు, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళలు పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలో శారద శిశు మందిర్ పాఠశాలలో వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పండరినాథ్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం పాఠశాలలో వరలక్ష్మీవ్రతం ప్రత్యేక పూజలు విద్యార్థుల తల్లిదండ్రులచే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోనిప్రియ, సుస్మిత, నవ్య, నిఖిత, స్వప్న, రేణుక, స్నేహిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ స్త్రీ సౌభాగ్యవతిగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఈ వ్రతాన్ని లక్ష్మీదేవి విగ్రహాన్ని పెట్టి అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించి ఒకరినొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటారు.



లింగంపేటలో..



ఎల్లారెడ్డిలో..



రాజంపేటలో..

గంజాయి కోసం పొలాల్లో తనిఖీలు



పొలాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గాంధారి, ఆగస్టు 16: మండలంలో నేరల్‌తండా, చెద్మల్‌తండా, బీర్మల్‌తండా, కొత్తబాది తండా, గుజ్జల్‌తండా, సోమారం తండా, గొల్లడి తండాల్లో పంట పొలాల్లో, అటవీ భూముల్లో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన గంజాయి పండించిన, రవాణా చేసిన, ఎవరి దగ్గరైన ఉన్న పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో సదాశివనగర్ సీఐ సంతోష్, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, గాంధారి ఎస్ఐ ఆంజనేయులు, సదాశివనగర్ ఎస్ఐ రంజిత్, ఎక్సైజ్ సీఐ షాకీర్, ఎస్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

కంట్రీబ్యూటర్లు కావలెను

కామారెడ్డి జిల్లా పరిధిలో ఈ దిగువ పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు కంట్రీబ్యూటర్లు కావలెను. అభ్యర్థుల కనీస విద్యార్హత ఇంటర్మీడియెట్. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తలుగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి. అభ్యర్థులు సంబంధిత మండలవాసులై ఉండాలి.

-: పనిచేయవలసిన కేంద్రాలు :-

❖ కామారెడ్డి అర్బన్ ❖ కామారెడ్డి క్రైం
❖ పాల్వంచ ❖ దోంగ్లీ ❖ బాన్సువాడ రూరల్
❖ తాడ్వాయి ❖ జుక్కల్ ❖ ఎల్లారెడ్డి రూరల్

ఆసక్తి గల అభ్యర్థులు తేది : 17-08-2024 (శనివారం) రోజున నిజామాబాద్ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఉ॥10:30 గం॥లకు జరిగే రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావలెను.

-: సంప్రదించవలసిన చిరునామా :-

ఆంధ్రజ్యోతి కార్యాలయం

గొల్లపల్లి రోడ్, గ్రా॥ ధర్మారం (బి), మం॥ డిచ్‌పల్లి, జి॥ నిజామాబాద్.
సెల్: 99854 11258, 99854 11461

బిల్లులు రావు.. నిర్మాణం పూర్తి కాదు!

- నిజాంసాగర్‌లో నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం పనులు
- చలనం లేని అధికారులు
- బిల్లులు లేవంటూ నిలిపిన కాంట్రాక్టర్

నిజాంసాగర్, ఆగస్టు 16: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం బిల్లులు రాకపోవడంతో అర్థాంతరంగా కాంట్రాక్టర్ నిర్మాణం పనులను నిలిపి వేశారు. ఎన్‌హెచ్ఎం నిధుల కింద గత ప్రభుత్వం రూ.20లక్షలను మంజూరు చేసింది. 2023 సెప్టెంబరులో ఉప కేంద్రం నిర్మాణానికి అప్పటి మాజీ సభాపతి, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ రాజు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేలు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్ చకచకా పనులను ప్రారంభించారు. పిల్లర్లు నిర్మాణం చేపట్టి స్లాబ్ పూర్తి చేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సకాలంలో రాకపోవడంతో బంజాపల్లి, నర్సింగ్ రావుపల్లి, అచ్చంపేట గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న ఉప కేంద్రాల నిర్మాణం జరగడం లేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. సుమారు రూ.50 లక్షల మేరకు బిల్లులు చెల్లించనున్నట్లు తెలిసింది. మండలంలో పాఠశాలల అదనపు గదులతో పాటు పాఠశాలలను నియోజకవర్గంలోని ఒక కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



11 నెలలు క్రితం వేసిన శిలాఫలకం



అసంపూర్తిగా మిగిలిన ఆరోగ్య ఉప కేంద్రం

FUN FESTIVAL IN THEATERS నేడే చూడండి




దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
తొల్లూరి 70 - ఇసిఐఎల్ 6.15,9.15 | సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 6.30pm | స్వప్న 70 - కాటేదాన్ 9.00pm

GEETHA FILM DISTRIBUTERS

ఈనెల 23న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES 9299992173

DOUBLE ISMART DOUBLE ENTERTAINMENT
BLOCKBUSTER నేడే చూడండి



సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 7.20,11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

దేవి - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 7.20,11.00 | జగదాంబ - ఘటకేసర్ 11.30,6.30 | శాంతి - నారాయణగూడ 11.00,6.00
తారకరామ - కాచిగూడ 2.15,9.00 | పద్మావతి - కాచిగూడ 8.00,11.00,2.45,5.45 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 8.00,11.15,2.15
లక్ష్మీకళ - మూసాపేట్ 11.15,2.30,6.15,9.30 | ఏఎంబి - గచ్చిబౌలి 9.50,10.15,1.05,1.25,3.55,7.15,10.05

డిచ్‌పల్లిలో బంద్ ప్రశాంతం

డిచ్‌పల్లి, ఆగస్టు 16: ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపార వాణిజ్య కేంద్రాలు మూసివేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిన జరిగిన ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన రిజిస్ట్రార్

డిచ్‌పల్లి, ఆగస్టు 16: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, రెగ్యూలర్ 4వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం 5వ రోజు ప్రశాంతంగా జరిగాయి. సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేం ద్రాన్ని రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 773 విద్యార్థులకు గాను 738 విద్యార్థులు హాజరయ్యారని 35 మంది గైర్హాజరయ్యరని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

టీయూకి వీసీని నియమించాలని సంతకాల సేకరణ

డిచ్‌పల్లి, ఆగస్టు 16: తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీకి వైస్‌చాన్స్‌లర్‌ను నియమించాలని సంతకాల సేకరణ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా వీసీని నియమించకపోవడం బాధాకరమన్నారు. వీసీ వర్సిటీ అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. టీయూకి వీసీ నియామించి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న అందోళనలు చేస్తామని నాయకులు చరణ్, వినిత్, చక్రిలు ఈ సందర్బంగా పేర్కొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి ఆగస్టు 16 : మండలంలోని ఘన్‌పూర్ ఇస్లాంపూర కాలనీలో పలు సమస్యలు పరిష్కరించాలని, అలాగే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పలువురు గ్రామస్తులు కోరారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు రామకృష్ణ, భూపతి, హమీద్ పాశా, సమీ, అఖిల్, వసీం పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లో మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

ఆర్మూర్, ముప్కాల్, ఆగస్టు 16 : బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటీవ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటీవ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

MASS MAHA BLOCKBUSTER నేడే చూడండి



సంధ్య 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

విమల్ 70ఎంఎం ఎ/సి - బాలానగర్ | జగదాంబ 70ఎంఎం ఎ/సి - ఘట్‌కేసర్
శాంతి 70ఎంఎం - నారాయణగూడ | శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ | ఈశ్వర్ 70 - అత్తాపూర్ | వైజయంతి 70 ఎ/సి - నాచారం
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ | ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ | శ్రీలక్ష్మి క.మం - అల్వాల్ | స్వప్న 70 ఎ/సి - కాటేదాన్
రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్ | తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ | శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి | శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి | మమత 70 ఎ/సి - వనస్థలిపురం | జ్యోతి 70 ఎ/సి - ఆర్‌సిపురం | గణేష్ 70 ఎ/సి - శంషాబాద్
ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్ | భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల | శ్రీకృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ | లక్ష్మి 70ఎంఎం - శంషాబాద్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

విమల్ 70 - బాలానగర్ | భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి | మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ | వెంకటరమణ పద్మావతి - కాచిగూడ
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ | తాళ్ళూరి 70ఎంఎం - ఇసిఐఎల్ | సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ | స్వప్న 70ఎంఎం - కాటేదాన్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

పొతంగల్ సహకార సంఘంలో అక్రమాలపై
విచారణ ప్రారంభం


పొతంగల్ సహకార సంఘంలో కొనసాగుతున్న విచారణ

కోటగిరి, ఆగస్టు 16 : రాష్ట్రంలోని సహకార సంఘాలకు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిన పొతంగల్ విశాల సహకార పరపతి సంఘం మరోమారు అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాలకవర్గం నిర్లక్ష్యం, సిబ్బంది ఇష్టారాజ్యం వల్ల అభివృద్ధి బాట నుంచి నష్టాల బాట పట్టింది. సహకార సంఘ నిబంధనలను ఉల్లఘించిన పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శిని తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సంఘంలో సుమారు 4 కోట్ల రూపాయల వరకు అవినీతి, అక్రమాలు జరిగాయంటూ సంఘసభ్యులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సుమారు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న విచారణ ఎట్టకేలకు ప్రారంభమైంది. పొతంగల్ విశాల పరపతి సంఘాన్ని శుక్రవారం మోర్తాడ్ అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్ సహకార సంఘాన్ని సందర్శించారు. సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. గతంలో వారు ఫిర్యాదు చేసిన అంశాలతో పాటు మరిన్ని అంశాలపై వివరాలు సేకరించారు. సంఘం నష్టపోవడానికి గల కారణాలను సంఘ సభ్యులు వివరించారు. సంఘ సిబ్బంది, విండో కార్యదర్శి బాధ్యతరహితంగా వ్యవహరించి, సంఘం నష్టపోయేలా చేశారని ఆరోపించారు. పాలకవర్గం చూసిచూడనట్లు వ్యవహరించడంపై అనేక అనుమానాలు ఉన్నాయని వారు వివరించారు. గతంలో రుణమాఫీ కింద మంజూరైన నిధులు సైతం దారి మళ్లినట్లు సభ్యులు ఆరోపించారు. విండో కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల సేల్ టాక్స్ ఇన్‌కమ్ టాక్స్ సుమారు 2.50కోట్లకు పైగా సంఘం చెల్లించాల్సి వచ్చిందన్నారు. పీఎఫ్ కింద 7లక్షల రూపాయలు సంఘం నష్టపోయిందన్నారు. విచారణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంలో రికార్డులు అన్ని పరిశీలించి నష్టాలకు గల కారణాలను సేకరిస్తామన్నారు. తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

నేటి నుంచి కాచిగూడ, గుంతకల్లు రైలు పున:ప్రారంభం

బోధన్‌రూరల్, ఆగస్టు 16 : మూడునెలల విరామం తర్వాత బోధన్ రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడ, గుంతకల్లు రైలు పునఃప్రారంభం కానుందని రైల్వేఅధికారులు శుక్రవారం వెల్లడించారు. శనివారం ఉదయం బోధన్ నుంచి కాచిగూడకు ఉదయం ఐదుగంటలకు యథావిధిగా రైలు పున:ప్రారంభం కానుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతున్న రైలును మళ్లీ ఆపివేయకుండా ముందులాగే నిరంతరం నడిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే కరీంనగర్ రైలును పునఃప్రారంభించాలని, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం జరిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జేఎల్‌ఎంలకు ప్రమోషన్‌లపై హర్షం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 16 : విద్యుత్ సంస్థలో జూనియర్ లైన్‌మెన్‌లుగా ఉద్యోగాలు పొందిన విధులు నిర్వహించిన వారికి ఎంపీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎఎల్‌ఎంగా ప్రమోషన్‌లు పొందడంతో హర్షం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని 57జెఎల్‌ఎంలకు ఎఎల్‌ఎంగా ప్రమోషన్‌లు రావడంతో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈ హరిచందర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, బోకెలతో సన్మానించిన అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీసీఎల్ సీఎండి వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌ల్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరేందర్‌నాయక్, కన్వీనర్ కల్ల శ్రీనివాస్‌యాదవ్, ఎన్.సంజీవ్, టి.నర్సయ్య, ఎండి.షకీల్, రాంచందర్, వేణుగోపాల్, సురేష్‌బాబు, అనిల్, ఎల్.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి'

బోధన్ రూరల్, ఆగస్టు 16 : బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందువులపై అరాచకాన్నిఖండిస్తూ మండలంలోని కల్దుర్కి గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు మనోహర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జి వెంకటేష్, బూత్ అధ్యక్షులు బలరాం, శివకుమార్, రామగొండ, సీనియర్ నాయకులు లచ్చప్ప, అశోక్, జంగం శివకుమార్, సాయిలు, శ్రీనివాస్, గంగాధర్, వీరభద్ర, గంగాకిషన్, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

జక్రాన్‌పల్లి, ఆగస్టు 16: ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద్‌రెడ్డి సహకారంతో శుక్రవారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.70వేల విలువ గల క్రీడా సామాగ్రిని ఎంఈవో శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగజమున, బాల్కొండ పీడీ రాజ్‌కుమార్, వీడీసీచైర్మన్ వెంకన్న, మాజీఎస్‌ఎంసీ చైర్మన్ గంగనర్సయ్య, ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

మోర్తాడ్, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని జాతీయరహదారిపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సుప్రయాణం సౌకర్యం కల్పించడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలను కించపరుస్తూ మాట్లాడడం తగదన్నారు. కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత పలు గ్రామాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మ ఊరేగింపు నిర్వహించి జాతీయరహదారిపై కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మాజీఎంపీపీ కల్లెడ చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు గిర్మాజీ గోపి, పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, తీగెల సంతోష్, బక్కురి ఆనంద్, నరేష్, ఉగ్గెర భూమేశ్వర్; నజీర్, హర్షద్, సురేష్, మహిపాల్, రంజిత్, పెండెం శ్రీని వాస్, ఎర్రం శీను పాల్గొన్నారు.

ఏర్గట్ల : మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన కేటిఆర్ తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి మహిళా సాధికారిక మీద దృష్టి పెట్టి మహిళల కోసం మహాలక్ష్మీ పథకం ప్రవేశ పెట్టి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తే జీర్ణించుకోలేక కేటీఆర్ వారిపై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, గడ్డం జీవన్, ముస్కుమోహన్, బద్ధం లింగారెడ్డి, మేకల సాయన్న, కొరిపెల్లి లింగారెడ్డి, ఇప్ప గంగయ్య, సామ్‌సన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


ఏర్గట్లలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సునిల్‌కుమార్

మెండోర : ఉచిత బస్సుల సౌకర్యార్థంపై తెలంగాణ మహిళనుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి మాట్లాడుతూ ఫ్రీ బస్సులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆరు గ్యారంటీల పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓర్వలేక మహిళలు ఆర్టీసీ బస్సులో బ్రెక్ డ్యాన్స్‌లు, రికార్డు డాన్సులు చేయండి అంటు కేటీఆర్ అత్యంత అవహేళనగా మాట్లాడారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జైడి సుందరవి పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : మహిళలను కించపర్చేలా మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావులు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడ్లారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీని చూసి కేటీఆర్ ఓర్చుకోలేక మహిళలను కించపరుస్తూ అగౌరవంగా మాట్లాడడం సరికాదన్నారు.

రైతుల రుణమాఫీ దేశచరిత్రలో నిలిచిపోతుంది

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 16: భారతదేశ చరిత్రలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోయిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విత్తనాభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతీ రైతుకు సుమారు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామని అన్నారు. సాంకేతిక సమస్యల ఉన్న రైతుల త్వరలోనే సరిచేసి రుణమాఫీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, ఇచ్చిన మాట ప్రకారం 27 రోజుల్లో రుణమాఫీ చేశారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడంతో ఓర్వలేని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష రుణమాఫీని చేయడానికి నానా తంటాలు పడిన బీఆర్ఎస్ నాయకులను రైతులు గమనించారని, కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు తన మాట ప్రకారం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రవి, ముప్కాల్ మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో రుణమాఫీపై కృతజ్ఞత తీర్మానం


సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తీర్మానం చేస్తూ ర్యాలీగా వెళ్తున్న నాగాపూర్ రైతులు

ముప్కాల్, ఆగస్టు 16 : శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసినందుకు శుక్రవారం బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

బాల్కొండ మండల కేంద్రం వరకు నాగాపూర్ రైతులు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్, అగ్రికల్చర్ అధికారులకు తీర్మానపత్రాన్ని అందజేశారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్


స్టాక్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 16 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఎరువుల దుకాణ యజమానులను జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ మల్లయ్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్ట్రర్‌లను పరిశీలించారు. ప్రతీ దుకాణ యాజమాని స్టాక్ వివరాలను బోర్డుపై రాసి అందరికి కనిపించేలా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈపాస్ ద్వారా ఎరువులను విక్రయించాలని అన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసు కుంటామని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లయ్య, ఏఈవో లక్‌పతి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 16: మండలంలోని ఉప్లూర్ గ్రామంలోని కటికె భవనంలో 11మంది పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై డి.అనిల్‌రెడ్డి తెలిపారు. రూ.8440 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నందిపేట ఎస్‌ఐగా హరిబాబు

నందిపేట, ఆగస్టు 16: నందిపేట ఎస్‌ఐగా ఏ హరిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. భీమ్‌గల్ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన హరిబాబు ఇటీవల జరిగిన ఎస్‌ఐల బదిలీలలో నందిపేటకు వచ్చారు. నందిపేట ఎస్‌ఐగా పనిచేసిన జి.రాహుల్ హెగ్డే నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అనుమానితులు గ్రామాల్లో సంచరించిన, గొడవలు జరిగే సూచనలు ఉన్నా సెల్ నెంబరు 8712659861 కు కాల్ చేయాలని ఎస్‌ఐ ఏ.హరిబాబు కోరారు.

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు ఎస్సైలు బదిలీ అయ్యారని ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఎస్సైలు అశోక్, హన్మాండ్లు బదిలీ కావడంతో శుక్రవారం పోలీస్ సిబ్బంది వారిని పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎస్సై అశోక్ ఆదిలాబాద్ బదిలీ కాగా, ఎస్సై హన్మాండ్లు నిజామాబాద్-2టౌన్‌కు బదిలీపై వెళ్లారు.

బోధన్‌రూరల్ : బోధన్ రూరల్ ఎస్‌ఐగా ఎం.రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ అయ్యారు. కమ్మర్‌పల్లిలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ బోధన్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక రవాణా, మట్కా, జూదంపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

నవీపేట : నవీపేట ఎస్‌ఐగా కే.వినయ్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్‌ఐగా పని చేసిన యాదగిరి గౌడ్ మోపాల్‌కు బదిలీ కాగా వేల్పూర్ ఎస్‌ఐగా పని చేసిన కే.వినయ్ నవీపేట ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : 44వ జాతీయ రహదారి గన్నారం శివారులో శుక్రవారం నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని అతివేగంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొందని, ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో లారీక్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కొని రెండు గంటల పాటు తీవ్ర నరకయాతన అనుభించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే క్షతగాత్రుడిని 108లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : మోపాల్ మండలం కంజర గ్రామానికి చెందిన గుడి ప్రణయ్(22) అనేయువకుడు గురువారం ముల్లంగి గ్రామ శివారులో నీటిలో పడి మృతిచెందాడని ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి తండ్రి సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిప్రి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ అందజేత

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 16 : ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం 1993-94 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు తమవంతు చేయూతను అందించారు. పూర్వవిద్యార్థి పెద్ది జ్ఞానేశ్వర్ తన తండ్రి రాజేశ్వర్ జ్ఞాపకార్థం రూ.40వేల విలువ చేసే ఐదు బీరువాలను సమకూర్చగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మరో పూర్వవిద్యార్థి బండికృష్ణ రూ.35వేల విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాలకు వితరణ చేశారు.

జక్రాన్‌పల్లిలో కురిసిన భారీ వర్షం

జక్రాన్‌పల్లి, ఆగస్టు16: మండలంలో శుక్రవారం మధ్యాహ్నాం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు భారీ వర్షం కురువడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. భారీవర్షం కురువడంతో వివిధ గ్రామాల చెరువులోకి నీరు వచ్చి చేరింది. మూడు రోజుల పాటు వర్షాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

కోటగిరిలో ఓ మోస్తరు..

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 10 రోజులుగా వర్షం లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఓ మోస్తరు వర్షం కురియడంతో వరి, సోయా పంటలకు జీవం పోసినట్లయింది.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

నవీపేట, ఆగస్టు 16 : నవీపేటలోని బాసర రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ విషయంపై శుక్రవారం లైన్‌మెన్ కృష్ణ నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో ఇటీవల తరుచుగా ట్రాన్స్‌ఫార్మర్ ఆయిళ్ల చోరీకి గురవుతున్నాయని, వెంటనే దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

'హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు'

జక్రాన్‌పల్లి, ఆగస్టు 16: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. శుక్రవారం సాయంత్రం జక్రాన్‌పల్లి, చందమియాబాగ్‌తండా, పడకల్ గ్రామాల్లో వాహనదారులకు ఎస్సై సీహెచ్.తిరుపతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, రాంగ్ రూట్‌లో వెళ్ళవద్దని సూచించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం


కోటగిరి, ఆగస్టు 16 : కోటగిరి మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్, రవి యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సహకార సంఘం ఆవరణలో ఆక్యుప్రెషర్, వివిధ వ్యాధులకు సంబంధించి శిబిరం ఏర్పాటు చేశారు. మరో ఆరురోజుల పాటు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో అధిక బరువు, రక్తపోటు, మెడనొప్పి, తలనొప్పి, మధుమేహం, ఏసీడీటీ, థైరాయిడ్, వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్సలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగాధర్ దేశాయ్, విఠల్‌సెట్, అశ్విన్‌సెట్, లక్ష్మణ్, రవి, కిషోర్, శ్రీధర్, నర్సయ్య, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో ఇంటింటి జ్వర సర్వే


సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

వేల్పూర్, ఆగస్టు 16 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. మండల వైద్య ఆరోగ్య శాఖ అధ్వంలో నిర్వహించిన కార్యక్ర మంలో గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు ప్రతీ ఇంటింటికి వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితులపై నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇంటి చుట్టు పరిసరాల్లో వారు పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షపు నీరు ఇంటి చుట్టు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు.

జాన్కంపేట్ గ్రామంలో నిర్వహించిన కార్యక్ర మంలో ఆరోగ్య కార్యకర్త కమల, పీహెచ్‌వో నారాయణ, ఆశవర్కర్‌లు కళావతి, వినోద, ఆయా గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







లింగంపేట బస్టాండ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట, ఆగస్టు 16: లింగంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా మోసాలు చేస్తారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎవరికి బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీలు, ఇతర వివరాలు ఎలాంటి పరిస్థితిల్లోనూ చెప్పవద్దన్నారు. బ్యాంక్ అధికారులు ఎట్టి పరిస్థితిల్లోనూ మీ వివరాలను ఫోన్ ద్వారా అడగరని వారు తెలియజేశారు. మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీటీం సభ్యులకు సమాచారం ఇవ్వాలని వారు తెలియజేశారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వారు సూచించారు. డయల్ 100, లేదా 1930కి కాల్ చేసి ఫిర్యాదులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజ, కానిస్టేబుల్ శంకర్, హోంగార్డు షబ్బీర్‌లు ఉన్నారు.

విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలి

● జడ్పీ సీఈవో చందర్‌నాయక్

సదాశివనగర్, ఆగస్టు 16: విద్యార్థినులకు రుచికరమైన భోజనం నాణ్యతగా అందించాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మర్కల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సోషల్ వెల్ఫేర్ హాస్టల్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. అన్నం సరిగా ఉడికించాలని సిబ్బందికి సూచించారు. డ్రైడే సందర్భంగా కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తర్వాత మర్కల్ గ్రామంలో దోమల మందు పిచికారీ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో వైద్యశిబిరం

దోమకొండ, ఆగస్టు 16: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఆయుష్ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు కీర్తన మాట్లాడుతూ అయుర్వేద ఔషధం పట్ల అవగాహన తెచ్చుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ ఆఫీసర్ మహమ్మద్, శ్యామ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికావు'

దోమకొండ, ఆగస్టు 16: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికావని వాటిని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన బీబీపేటలో మాట్లాడారు. మహిళలను కించపరుస్తూ బస్సుల్లో బ్రేక్ డ్యాన్స్‌లు, రికార్డింగ్ డ్యాన్స్‌లు చేసుకోండని మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు.

నేడు దోమకొండ, రామారెడ్డి బంద్

దోమకొండ, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాకాండలకు నిరసనగా శనివారం దోమకొండ, రామారెడ్డి మండలాల్లో బంద్‌కు హిందూ ధర్మ పరిరక్షణ సమితి పిలుపునిచ్చింది. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాలు స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న టీజేఎస్ నాయకులు

కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 16: జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియమించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ టీజేఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కోదండరాంకు ఎమ్మెల్సీగా నియమించినందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఉద్యమకారులను గుర్తించకుండా అణిచివేత ధోరణి అవలంబించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఫూల్‌సింగ్ రాథోడ్, నరేష్, యోగేష్, ప్రవీణ్, కిషోర్, రాజు, నర్సింలు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాయమవుతున్న మహా వృక్షాలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 16: మెదక్ - రుద్రూరు 765 డీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికేస్తుండటంతో ఎన్నో మహా వృక్షాలు నేలకొరుగుతున్నాయి. సుమారు గత వందేళ్ల క్రితం అప్పట్లో రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లు అవి పెరిగి మహా వృక్షాలయ్యాయి. ఎన్నో దశాబ్దాలుగా రహదారి వెంట వెళ్లే ప్రజలకు, వాహనదారులకు నీడను కల్పిస్తుండటంతో పాటు చల్లని గాలిని వీస్తూ ఎంతో ఆహ్లాదాన్ని పంచిపెట్టాయి. అలాంటి మహా వృక్షాలు ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వేలాది చెట్లు నేలకొరుగుతున్నాయి. పచ్చదనంపైన గొడ్డలి వేటు తప్పడం లేదు. 765 డీ జాతీయ రహదారి నిర్మాణం కోసం మెదక్ నుంచి రుద్రూరు వరకు 2022లో కేంద్ర ప్రభుత్వం 899 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ప్రస్తుత సంవత్సరం 2024 మార్చి 5న పటాన్‌చెరువులో జరిగిన విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని ఈ జాతీయ రోడ్డు నిర్మాణం పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ జాతీయ రోడ్డు నిర్మాణం పనులకు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడంతో జాతీయ రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభమయ్యాయి. మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండలంలో, నాగిరెడ్డిపేట మండలంలో రోడ్డు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు ఒక ప్యాకేజీ, ఎల్లారెడ్డి నుంచి రుద్రూరు వరకు మరో ప్యాకేజీ ద్వారా జాతీయ రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. ప్రస్తుతం మెదక్ - ఎల్లారెడ్డి ప్యాకేజీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికేస్తున్నారు. రోడ్డుకు ఇరుపక్కల అత్యధికంగా మామిడి చెట్లు, మర్రి చెట్లు, వేప చెట్లు ఉన్నాయి.

- జాతీయ రహదారి విస్తరణలో నేలకొరుగుతున్న వందేళ్ల చెట్లు
- పచ్చదనంపై తప్పని గొడ్డలి వేటు
- రోడ్డు విస్తరణలో సుమారు 10 వేల చెట్ల తొలగింపు
- జిల్లా పరిధిలో 7,800 వరకు తొలగించే చెట్ల గుర్తింపు
- నాగిరెడ్డిపేట మండలంలో ముమ్మరంగా సాగుతున్న చెట్ల తొలగింపు పనులు

సుమారు వందేళ్ల క్రితం అప్పట్లో రోడ్డు నిర్మాణ సమయంలో నాటిన ఈ చెట్లు ప్రస్తుతం మహా వృక్షాలుగా మారాయి. జాతీయ రహదారి విస్తరణ పనులు ఫలితంగా సుమారు వందేళ్ల నాటి ఆ మహా వృక్షాలు గొడ్డలి వేటుకు బలమవుతూ నేలకొరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మహా వృక్షాలన్నీ ప్రస్తుతం మాయమవుతున్నాయి.

జాతీయ రహదారి విస్తరణ కోసం 10 వేల చెట్ల తొలగింపు

మెదక్ - రుద్రూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 10 వేల చెట్లను తొలగించనున్నట్లు తెలుస్తోంది. రోడ్డు విస్తరణతో ప్రస్తుతం రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలోని మెదక్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, బాన్సువాడ, వర్ని, అటవీశాఖ రేంజ్ అధికారులు సర్వే నిర్వహించి తొలగించాల్సిన చెట్లను గుర్తించారు. కామారెడ్డి జిల్లా పరిధిలో నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామం నుంచి నసురుల్లాబాద్ మండలం వరకు సుమారు 7,800 చెట్లు తొలగించేందుకు అటవీ శాఖ అధికారులు సర్వే జరిపి గుర్తించినట్లు మండల అటవీశాఖ రేంజ్ అధికారి వాసుదేవ్ తెలిపారు. ప్రస్తుతం నాగిరెడ్డిపేట మండలంలో చెట్ల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. రహదారి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి వాహనాల ద్వారా కలపను సంబంధిత కాంట్రాక్టర్ హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఏది ఏమైనా సుమారు వందేళ్ల నాటి మహా వృక్షాలు ఇలా నేలకొరుగుతుండటంతో ఆ దృశ్యాలను చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో బాధ పడుతున్నారు.



నాగిరెడ్డిపేట వద్ద నేలకొరిగిన మహా వృక్షం

రెట్టింపు మొక్కలు నాటనున్న అటవీ శాఖ అధికారులు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రస్తుతం రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున, తొలగిస్తున్న చెట్లకు బదులుగా రెట్టింపు కొత్త మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఆయా రేంజ్ పరిధిలో తొలగిస్తున్న చెట్ల సంఖ్యను బట్టి అటవీ శాఖకు కేటాయించిన స్థలంలో ప్రస్తుతం తొలగించిన చెట్లకు బదులుగా రెట్టింపు మొక్కలను నాటనున్నట్లు, నాటిన మొక్కలు పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్ తెలిపారు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషి చేయాలి



లింగంపేటలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

లింగంపేట, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల కో ఆర్డినేటర్ జక్సాని దత్తురాంలు మాట్లాడుతూ కోట్లాది భారతీయులకు మార్గదర్శి వాజ్‌పేయి అని ఆయన కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం బీజేపీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ దత్తురాంలు, రాష్ట్ర నాయకులు బొల్లారం సాయిలు, వెంకటి, విఠల్, కృష్ణ, పోచయ్యలతో పాటు నాయకులు ఉన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పన్యాల రవీందర్‌రెడ్డి, తిప్పాపురం రవి, అనుపాటి నరేందర్‌రెడ్డి, శ్రీనాథ్, సచిన్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వాజ్‌పేయికి నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో..



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

మహనీయుల మార్గాల్లో నడవాలి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్, ఆగస్టు 16 : మద్నూర్ మండల కేంద్రంలో సాహిత్య రత్న లోక షాహిర్ అన్నాబావు సాఠే 104వ జయంతి లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీయేటా మహనీయుల జయంతిని జరుపుకోవడమే గాక వారు చూపించిన మార్గాల్లో నడవాలని వారి ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, మాజీ సర్పంచ్ విఠల్ గురుజీ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు హన్మాండ్లు, స్వామి, యువజన కాంగ్రెస్ అభ్యర్థి హనుమంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్య పనుల కరువు



బొంపల్లిలో పాఠశాల ప్రహరీ పక్కన అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

- సదాశివనగర్ మండలంలోని అనేక గ్రామాల్లో పేరుకపోతున్న చెత్తా చెదారం
- భూంపల్లిలో విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలు

సదాశివనగర్, ఆగస్టు 16: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం కరువవుతోంది. మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భూంపల్లి గ్రామంలో గత 20 రోజుల నుంచి విష జ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. గత నాలుగు రోజుల కిందట గ్రామంలో 9 సంవత్సరాల బాలుడు జ్వరం భారిన పడి చనిపోవడంతో గ్రామస్థులు మరింత భయపడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో పూర్తిగా పారిశుధ్యం కరువైందని పేర్కొంటున్నారు. వారం రోజులుగా ఇంటికొక్కరు జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామానికి ప్రత్యేకాధికారి లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో మురికి కాలువల్లో చెత్తా చెదారం పేరుకపోయి రోగాల భారిన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. వారం రోజుల క్రితం వైద్య బృందం క్యాంపు తూతూ మంత్రంగా ఏర్పాటు చేసి వెళ్లిపోయారనే విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్లాల్సి వస్తుందని ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మద్నూర్ పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో

మద్నూర్, ఆగస్టు 16: ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం మద్నూర్ పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల కేటీఆర్ మహిళల పట్ల తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ రాస్తారోకో చేశారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్ డ్యాన్సులు, రికార్డు డ్యాన్సులు చేసుకోవచ్చని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయని విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాయకులు హెచ్చరించారు. కేటీఆర్ తక్షణమే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ సర్పంచ్ విఠల్ గురించి డిమాండ్ చేశారు. రాస్తారోకో కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, మాజీ అధ్యక్షుడు రమేష్, నాయకులు చెవుల హన్మాండ్లు, బండి గోపి, హన్మాండ్లు, జావీద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'అసైన్డ్ భూములకు పంట రుణాలివ్వాలి'

నిజాంసాగర్, ఆగస్టు 16: ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన అసైన్ మెంట్ భూములకు పంట రుణాలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు ప్రజా పండరీ అన్నారు. శుక్రవారం ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పాస్‌బుక్‌లలో అసైన్డ్‌మెంట్ భూములు నమోదు ఉన్నప్పటికీ రుణాలు ఇవ్వడం లేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షలు మాఫీ చేసిందని, డీసీసీబీ అబిడ్స్ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములకు ఈ బ్యాంకు నుంచి రుణాలు అందించేందుకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అసైన్‌మెంట్ భూములతో ఫారెస్ట్ భూములు ఓఆర్ఎఫ్ ద్వారా పట్టాలు పొందిన వారికి రుణాలు ఇవ్వాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద, ఆగస్టు 16: బిచ్కుంద సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉం టుందని ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భిక్కనూరు, ఆగస్టు 16: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైనా సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం తెల్లరేషన్‌కార్డు ఉన్న పార్టీలకు అతీతంగా ఎవరైనా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందే పరిస్థితులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ రాజేశం, బీజేపీ మండల అధ్యక్షుడు పిట్లశ్రీను, సీనియర్ నాయకులు గంగారెడ్డి, రాము, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ రైతువేదికలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో తిరుపతిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్‌గౌడ్, బీజేపీ మండల నాయకులు సాయిరాంగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 16: తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి ఓ రైతు మృతి చెందిన ఘటన జలాల్‌పూర్‌లో శుక్రవారం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిట్కుల పోచయ్య(38) అనే రైతు తనకున్న ఐదెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లాడు. అయితే పొలం వద్ద విద్యుత్ రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ తీగలు తెగి కింద పడినట్లు గమనించాడు. అయితే వాటిని సరి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు కాలు తగిలి పోచయ్య కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పారిజాతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ

దోమకొండ, ఆగస్టు 16: మండలంలోని అంచనూర్ గ్రామంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కులస్థులు ఆయనను శాలువతో సన్మానించారు. 50 సంవత్సరాలు నిండిన కురుమ కులస్థులకు పించన్ అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమ కులస్థులు ఐక్యంగా ఉండి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కురుమ కులస్థులు భూమన్న, చంద్రం, బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్, జగదీశ్, సంజీవ్, బీరయ్య, రవి, మల్లయ్య, శ్రీశైలం, గంగయ్య, సంజీవ్, నరేష్, సత్యనారాయణ, కురుమ కులస్థులు పాల్గొన్నారు.



అంచనూర్‌లో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణకు కురుమ కులస్థులతో వస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మండల పరిషత్ కార్యాలయంతో పాటు బీబీపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులకు చెక్కులను పంపిణీ చేశామన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70	- తంగలన్
ప్రియా 35	- సరకాతి కా అటాంక్

బాన్సువాడ

మహేశ్వరి	- భవనమ్
వెంకటేశ్వర	- తుఫాన్ (మార్నింగ్‌షో) కమిటీ కుర్రోళ్లు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190



CLASSIFIEDS

WANTED

LAB TECHNICIANS / NURSING STAFF / NIGHT DUTY LAB TECHNICIANS. (BALAJI PATHOLOGY LAB) CONTACT NO. 98481 75581,93466 05125


AJZ

మా చిత్రంలో నటించే అవకాశం

★ శ్రీ వెంకట లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఒక చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తున్నాం. నూతన నటీనటులు కావాలి. మీ ఫోటోలు వాట్సాప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. నరసింహారెడ్డి డైరెక్టర్.

AJH-002567

Classifieds ఆంధ్రజ్యోతి
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453